@netifocusnews @focustv
www.netifocusnews.com
http://epaper.netifocusnews.com
TS-18-0006625

FOCUS TELUGU TV
అనునిత్యం - ప్రజాపక్షం

# నేటి ఫోకస్ న్యూస్

అను నిత్యం...ప్రజా పక్షం...

తెలుగు డిజిటల్ దినపత్రిక

ఎడిటర్: యం.తరుణ్ | తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రజల కోసం మా ఈ నేటి ఫోకస్ న్యూస్ తెలుగు డిజిటల్ దినపత్రిక | హైదరాబాద్ | మంగళవారం 02, జులై 2024 | పేజీలు: 04

## ఇద్దరం కలిసి మాట్లాడుకుందాం..

### విభజన అంశాలపై చర్చిద్దాం..

### ఆమోదయోగ్య పరిష్కారాలు గుర్తిద్దాం..

- 6న మీరున్న చోటికే వస్తా.. • రేవంత్ రెడ్డికి బాబు లేఖ
- తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సానుకూల స్పందన
- హైదరాబాద్‌లో ఇరువురు సీఎంల భేటీ..



నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్/అమరావతి-జూలై 1:

తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రుల భేటీకి రంగం సిద్ధమైంది. ఈ నెల 6వ తేదీన హైదరాబాద్‌లోని ప్రజా భవన్‌లో ఈ సమావేశం జరగనుంది. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దీనిపై స్వయంగా తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డికి లేఖ రాశారు. రాష్ట్ర విభజన జరిగి పదేళ్లు పూర్తయిన సందర్భంలో సంబంధిత అంశాలపై ముఖాముఖి చర్చించుకుందామని ప్రతిపాదించారు. ఇందుకు రేవంత్ కూడా అంగీకరించారు. దీనిపై మంగళవారం లిఖితపూర్వకంగా తన స్పందన తెలియచేయనున్నారు. రెండు తెలుగు రాష్ట్రాల మధ్య అపరిష్కృతంగా ఉన్న సమస్యల పరిష్కారం కోసం అధికారికంగా ఈ సమావేశాన్ని నిర్వహిస్తున్నారు.

ఈ సమావేశానికి ముఖ్యమంత్రులతోపాటు రెండు రాష్ట్రాల నుంచి ఇద్దరు చొప్పున సీనియర్ మంత్రులు, సంబంధిత అంశాలకు సంబంధించిన సీనియర్ అధికారులు కూడా హాజరవుతారు. ఉమ్మడి రాష్ట్ర విభజన సమయంలో కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన విభజన చట్టంలో పేర్కొన్న కొన్ని అంశాలు రెండు రాష్ట్రాల మధ్య ఇంకా అపరిష్కృతంగా ఉండిపోయాయి. ఉమ్మడి సంస్థల మధ్య ఆస్తుల విభజన కూడా పూర్తికాలేదు. ఈ నేపథ్యంలోనే రేవంత్‌తో భేటీకి చంద్రబాబు సిద్ధమయ్యారు. 'నేనే మీ వద్దకు వస్తాను' అంటూ భేషజాలను పక్కన పెట్టి మరీ లేఖ రాశారు. ఈ భేటీకి ముందు చంద్రబాబు రెండు రోజులపాటు మిగతా 2లో..

## మీరు హిందువులు కాదు.

హిందూధర్మం అహింస, నిర్భీతిని ప్రవచిస్తే.. మీరు హింస, ద్వేషం వ్యాపింపజేస్తున్నారు




- అధికార పక్షానికి 24 గంటలూ అదే పని
- లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ తీవ్ర వ్యాఖ్యలు
- హిందూ సమాజాన్నే హింసావాదులంటారా?
- రాహుల్ వ్యాఖ్యలు తీవ్రమైన విషయం: మోదీ



నేటి ఫోకస్ న్యూస్, న్యూఢిల్లీ-జూలై 1:


బీజేపీ వాళ్లు హిందువులే కాదని లోక్‌సభలో విపక్ష నేత రాహుల్‌గాంధీ అన్నారు. భయాన్ని, విద్వేషాన్ని, అబద్ధాలను వ్యాపింపజేయడం హిందూధర్మం కాదని చెప్పారు. తాము హిందువులమని చెప్పుకొంటున్న వారు నిత్యం హింస, విద్వేష వ్యాప్తికి పాల్పడుతున్నారని వ్యాఖ్యానించారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్, ప్రధాని మోదీ వీరెవరూ మొత్తం హిందూ సమాజానికి ప్రతినిధులు కాదని స్పష్టం చేశారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై సోమవారం మధ్యాహ్నం సభలో రాహుల్‌గాంధీ విపక్ష నేత హోదాలో మిగతా 2లో..

## హైకోర్టులో కేసీఆర్‌కు ఎదురుదెబ్బ

- విద్యుత్తు కమిషన్‌పై వేసిన పిటిషన్ డిస్మిస్
- కమిషన్ ఏర్పాటుకు హైకోర్టు సమర్థన
- అప్పగించిన అంశాలు విస్తృతమైనవి..
- చైర్మన్ రాజ్యాంగబద్ధ పదవిలో పనిచేశారు
- తన వద్ద ఉన్న విషయాలనే వెల్లడించారు
- తీర్పులో స్పష్టం చేసిన హైకోర్టు ధర్మాసనం

నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్-జులై 01:

మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు హైకోర్టులో భారీ ఎదురుదెబ్బ తగిలింది. తన ప్రభుత్వ హయాంలో జరిగిన విద్యుత్తు కొనుగోళ్లు, విద్యుత్తు ప్లాంట్ల నిర్మాణంపై ప్రస్తుత ప్రభుత్వం ఏర్పాటు చేసిన విచారణ మిగతా 2లో..





## మైక్రోసాఫ్ట్ డేటా సెంటర్ల విస్తరణ పనుల పూర్తి

- త్వరగా కార్యకలాపాలు కొనసాగించాలి
- సంస్థ ప్రతినిధులతో ఐటి మంత్రి శ్రీధర్ బాబు సమీక్ష

నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్-జూలై1:

మైక్రోసాఫ్ట్ డేటా సెంటర్ల విస్తరణ పనులు వచ్చే ఏడాది నాటికి పూర్తి చేసి కార్యకలాపాలను పెంచాలని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సంస్థ ప్రతినిధులను కోరారు. విస్తరణ పూర్తయితే అత్యాధునిక డేటా సెక్యూరిటీ, క్లౌడ్ సొల్యూషన్స్ రంగాల్లో హైదరాబాద్ అగ్రస్థానానికి చేరుకుంటుందని మంత్రి వెల్లడించారు. డేటా సెంటర్లకు సంబంధించిన భూ సమస్యల పరిష్కారం, మౌలిక వసతులపై సచివాలయంలో మైక్రోసాఫ్ట్ ప్రతినిధులతో ఆయన సోమవారం నాడు సమీక్షా సమేవేశం నిర్వహించారు. డేటా సెంటర్ కోసం మేకగూడలో సేకరించిన 22 ఎకరాలకు సంబంధించి స్థానిక పంచాయతీతో కొన్ని సమస్యలున్నట్టు మైక్రోసాఫ్ట్ అధికారులు మిగతా 2లో..



## ఎల్లుండే తెలంగాణ కేబినెట్ విస్తరణ

### తెలంగాణ మంత్రివర్గంలోకి మరో ఆరుగురికి అవకాశం

- ఇద్దరు బీసీ, మైనారిటీ, ఇద్దరు ఓసి, ఒక ఎస్టీకి అవకాశం
- రేపు మరోసారి ఢిల్లీ వెళ్లనున్న సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి ఉత్తమ్
- నిన్న గవర్నర్‌తో సుదీర్ఘ సమావేశం
- కేబినెట్ విస్తరణతో పాటు శాఖల మార్పుకు అవకాశం

2



## యూపీఎస్సీ సివిల్స్ ఫలితాలు విడుదల

నేటి ఫోకస్ న్యూస్, న్యూఢిల్లీ-జూలై1:

అఖిల భారత సర్వీసుల్లో ఉద్యోగాల భర్తీకి నిర్వహించిన యూపీఎస్సీ సివిల్స్ ప్రిలిమినరీ పరీక్ష ఫలితాలు విడుదలయ్యాయి. దేశవ్యాప్తంగా జూన్ 16న మిగతా 2లో..

## నిరుద్యోగుల పట్ల ఇదేనా పోలీసుల తీరు?

- పరామర్శకు వెళ్లిన వారిపై లాఠీఛార్జీయా
- గాంధీ ఆస్పత్రి ఘటనపై కెటిఆర్ ఆగ్రహం

2



## అనుమతి లేని బిఆర్ఎస్ కార్యాలయం కూల్చేయండి



### అధికారులకు మంత్రి కోమటిరెడ్డి ఆదేశాలు..

నేటి ఫోకస్ న్యూస్, నల్లగొండ-జూలై1:

ఎలాంటి అనుమతి లేకుండా ప్రభుత్వ స్థలంలో నిర్మించిన బీఆర్ఎస్ పార్టీ ఆఫీసును కూల్చివేయాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం నల్గొండ డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్ రెడ్డి పదవీ ప్రమాణ స్వీకారంలో మంత్రి పాల్గొని మాట్లాడుతూ.. పేదలకు ఇండ్లు కట్టుకుంటే అధికారులు ఊరుకోరని, బీఆర్ఎస్ ఆఫీసు విషయంలో ఎందుకు తాత్సారం చేస్తున్నారని ప్రశ్నించారు. దాదాపు రెండు కోట్ల రూపాయల విలువ చేసే స్థలాన్ని కబ్జా చేసి పార్టీ ఆఫీసు నిర్మించారన్నారు. ఇప్పటికే రెండు నోటీసులు ఇచ్చినట్టు మున్సిపల్ కమిషనర్ తెలుపగా.. మిగతా 2లో..

## ఇద్దరం కలిసి మాట్లాడుకుందాం!

(మొదటి పేజీ తరువాయి..)

ఢిల్లీలో పర్యటించనున్నారు. ఆ సమయంలో ఈ అపరిష్కృత సమస్యల గురించి కేంద్ర ప్రభుత్వం దృష్టికి కూడా తీసుకురానున్నారు. దాని కొనసాగింపుగా రేవంత్‌తో ఆయా అంశాలపై చర్చిస్తారు. జగన్, కేసీఆర్ ముఖ్యమంత్రులుగా ఉన్నప్పుడు ఒకసారి సమావేశమైనా... అది వారిద్దరి వ్యక్తిగత భేటీగానే జరిగింది. ఏ అంశమూ పరిష్కారం కాలేదు. ఈసారి ఇటు చంద్రబాబు, అటు రేవంత్ ఇద్దరూ సానుకూల దృక్పథంతో ఉండటంతో... విభజన అంశాల పరిష్కారంలో ముందడుగు పడే అవకాశముందని అంటున్నారు. చంద్రబాబు, రేవంత్ ముఖ్యమంత్రుల హోదాలో సమావేశం కావడం ఇదే మొదటిసారి. రేవంత్ గతంలో చంద్రబాబు నాయకత్వంలో టీడీపీలో పనిచేశారు. ఆ తర్వాత ఆ పార్టీని వీడి కాంగ్రెసలో చేరారు. ఆ పార్టీ నుంచి తెలంగాణ ముఖ్యమంత్రి అయ్యారు. వేర్వేరు రాష్ట్రాలు, వేర్వేరు రాజకీయ శిబిరాల్లో ఉండటంతో వీరిద్దరూ కలుసుకోవడం ఇటీవలి కాలంలో సాధ్యపడలేదు. చంద్రబాబు ప్రమాణ స్వీకార కార్యక్రమానికి రేవంత్‌కు ఆహ్వానం అందినా... ఆ కార్యక్రమాన్ని ఎన్డీయే కూటమి కార్యక్రమంగా నిర్వహించడంతో ఆయన రాలేదు. అధికారికంగా రెండు రాష్ట్రాల మధ్య ఒక సమావేశాన్ని నిర్వహించాలన్న ఆలోచన ఇటీవల ఇరువైపులా వచ్చింది. దాని ఫలితమే ఈ సమావేశమని చెబుతున్నారు. దీనికి ప్రాతిపదికగా చంద్ర బాబు అధికారికంగా తెలంగాణ ముఖ్యమంత్రికి ఒక లేఖ రాసి దానిని సోమవారం రాత్రి తన 'ఎక్స్' ఖాతాలో పోస్టు చేశారు.



## మైక్రోసాఫ్ట్ డేటా సెంటర్ల విస్తరణ పనుల పూర్తి

(మొదటి పేజీ తరువాయి..)

మంత్రి దృష్టికి తేగా సాయంత్రంలోగా పరిష్కరించాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కె.శశాంకను ఆదేశించారు. విద్యుత్తు సబ్ స్టేషన్ల సామర్థ్యం పెంపు, వరద నీటి కాలువల నిర్మాణం లాంటి పనులు గడువులోగా పూర్తి చేస్తామని శ్రీధర్ బాబు తెలిపారు. సంస్థ సేకరించిన భూముల వినియోగ మార్పిడి పనులు వేగంగా పూర్తి చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. మైక్రోసాఫ్ట్ సంస్థ రంగారెడ్డి జిల్లా మేకగూడలో 22 ఎకరాలు, షాద్ నగర్ లో 41 ఎకరాలు, చందన్ వ్లలెలో 52 ఎకరాలు కొనుగోలు చేసింది. డేటా సెంటర్ల పనులు 70 శాతం పూర్తయ్యాయని సంస్థ ప్రతినిధులు శ్రీధర్ బాబుకు వివరించారు. ప్రభుత్వం తరపు నుంచి పెండింగ్ పనుల పర్యవేక్షణ కోసం ఒక అధికారిని నియమిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. మైక్రోసాఫ్ట్ తన కార్యకలాపాలను గ్రామీణ ప్రాంతాలకు కూడా విస్తరించాలని సూచించారు. సమీక్షా సమావేశంలో మైక్రోసాఫ్ట్ ఏషియా ఆపరేషన్స్ హెడ్ ఇయాన్ కాలన్, భూ అభివృద్ధి విభాగం హెడ్ ఉత్తమ్ గుప్తా, ఇండియా కమ్యూనిటీ హెడ్ శ్రీచందన తదితరులు పాల్గొన్నారు.

## యూపీఎస్సీ సివిల్స్ ఫలితాలు విడుదల

(మొదటి పేజీ తరువాయి..)

ఈ పరీక్ష నిర్వహించిన యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ సోమవారం ఫలితాలు విడుదల చేసింది. మెయిన్స్ పరీక్షకు క్వాలిఫై అయిన అభ్యర్థుల రోల్ నంబర్లతో జాబితాను విడుదల చేసింది. ఈ పరీక్షలో అభ్యర్థులు సాధించిన మార్కులు, కటాఫ్ మార్కులు, ఆన్సర్ కీ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయనున్నట్లు తెలిపింది. అలాగే, ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్‌లో ఉద్యోగాల భర్తీకి నిర్వహించిన ప్రిలిమినరీ పరీక్ష ఫలితాలను సైతం యూపీఎస్సీ ప్రకటించింది. ఐఎఫ్ఎస్ (మెయిన్) పరీక్షకు అర్హత సాధించిన వారి జాబితాను విడుదల చేసింది.

## నిరుద్యోగుల పట్ల ఇదేనా పోలీసుల తీరు?

**నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్-జూలై1:**

తమ డిమాండ్ల సాధన కోసం ఆందోళన చేస్తున్న నిరుద్యోగుల పట్ల పోలీసులు వ్యవహరిస్తున్న తీరుపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గాంధీ హాస్పిటల్ వద్ద నిరుద్యోగ యువకులపై పోలీసులు లాఠీఛార్జ్ చేయటాన్ని తీవ్రంగా తప్పుబట్టారు. నిరుద్యోగ హక్కుల కోసం దీక్ష చేస్తున్న మోతీలాల్‌ను పరామర్శించేందుకు వెళితే నిరుద్యోగ యువకులపై లాఠీ ఛార్జ్ చేయడం ఏంటని మండిపడ్డారు. ప్రజాపాలనలో పరామర్శించటం, నిరసన తెలిపే హక్కు కూడా లేదా అని ప్రశ్నించారు. పోలీసులు వ్యవహరిస్తున్న తీరును ఆక్షేపించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకే నిరుద్యోగులను తరుముతూ పోలీసులు లాఠీ ఛార్జ్ చేశారని ఆరోపించారు. అటు నిరుద్యోగ యువకుల కోసం దీక్ష చేస్తున్న మోతీలాల్ పరామర్శించేందుకు వెళ్లిన బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, పార్టీ విద్యార్థి విభాగం నాయకుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్, పార్టీ సీనియర్ నాయకులు రాకేష్ రెడ్డి సహా పలువురు ప్రజా ప్రతినిధులకు కూడా పోలీసులు అడ్డుకున్నారు. మోతీలాల్‌ను కలవకుండా అడ్డుకొని వారిని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. దీనిపై కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులు అదుపులోకి తీసుకున్న పార్టీ నాయకులందరినీ బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగ యువకుల న్యాయమైన డిమాండ్లను పట్టించుకోకుండా వారికి సంఘీభావం తెలుపుతున్న యువకులు, ప్రతిపక్షాల నాయకులను అడ్డుకోవడం ప్రభుత్వ దమననీతికి నిదర్శనం అన్నారు. ఇప్పటికైనా ఇలాంటి అప్రజాస్వామ్య చర్యలను మానుకోవాలని ప్రభుత్వానికి సూచించారు. నిరుద్యోగులు, యువకులు డిమాండ్ చేస్తున్నట్లుగా ఉద్యోగ నోటిఫికేషన్‌లను వెంటనే జారీ చేయాలన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి పక్రియ ప్రారంభించాలని రేవంత్ రెడ్డి సర్కార్‌ను కేటీఆర్ డిమాండ్ చేశారు. ఆందోళన చేస్తున్న నిరుద్యోగులకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ప్రభుత్వం నిరుద్యోగుల డిమాండ్లను పట్టించుకోకపోతే ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని కేటీఆర్ హెచ్చరించారు.

# మీరు హిందువులు కాదు!

(మొదటి పేజీ తరువాయి..)

తొలిసారిగా మాట్లాడారు. సందర్శకుల గ్యాలరీ నుంచి తల్లి సోనియా, సోదరి ప్రియాంక చూస్తుండగా సుదీర్ఘంగా గంటా 40 నిమిషాలపాటు ప్రసంగించారు. ఆయన మాట్లాడటానికి లేవగానే బీజేపీ సభ్యులు జైశ్రీరాం అని, విపక్ష సభ్యులు జైసంవిధాన్ అని పోటాపోటీ నినాదాలు చేశారు. ప్రసంగంలో భాగంగా రాహుల్ చేసిన వ్యాఖ్యలపై సభలో తీవ్ర దుమారం చెలరేగింది. మొత్తం అధికారపక్షం లేచి నిలబడింది. స్వయంగా ప్రధాని మోదీ రెండుసార్లు, మధ్యలో ఐదుగురు మంత్రులు ఒక్కోసారి రాహుల్ ప్రసంగానికి అడ్డుపడ్డారు. అయితే, రాహుల్ ఎక్కడా తలొగ్గకుండా తన ప్రసంగ ధాటిని కొనసాగించారు. ధైర్యం గురించి అన్ని మతాలు చెప్పాయని, ఖురాన్ కూడా నిర్భీతిని ప్రబోధించిందని, దువా(ఆశీస్సుల) కోసం లేచే చేతిలో కనిపించేది అభయ ముద్రేనని రాహుల్‌గాంధీ చెప్పారు. ఈ సందర్భంగా రాహుల్ సభలో శివుడు, జీసస్, గురునానక్ చిత్రాలను ప్రదర్శించారు. హిందూత్వం, ఇస్లాం, సిక్కు, క్రైస్తవం, బౌద్ధ, జైన మతాలు నిర్భీతిని



ప్రబోధించాయని గుర్తు చేశారు. వీళ్లందరూ భయపడొద్దు.. భయపెట్టొద్దు అని చెప్పారన్నారు. పరమ శివుడు కూడా ఎవరికీ భయపడొద్దు, ఎవర్నీ భయపెట్టొద్దని అభయ హస్తాన్ని చూపుతున్నాడని, అహింసను ప్రబోధిస్తున్నాడని దేవుడి చిత్రాన్ని చూపిస్తూ అన్నారు. మీరు హిందువులే కాదు.. తమను హిందువులుగా చెప్పుకొనే వాళ్లు 24 గంటలూ విద్వేషాన్ని, హింసను, అబద్ధాలను వ్యాపింపజేయడమే పనిగా పెట్టుకున్నారని బీజేపీ సభ్యుల వైపు వేలు పెట్టి చూపిస్తూ రాహుల్ అన్నారు. బీజేపీ సభ్యులు ఆగ్రహంతో లేచి నిలబడగానే మీరు హిందువులే కాదు అని మరింత గట్టిగా చెప్పారు. సత్యానికి కట్టుబడి ఉండాలని, వెనక్కి తగ్గొద్దని, సత్యం మాట్లాడటానికి భయపడొద్దని హిందూమతంలో రాసి ఉందన్నారు. ఈ సందర్భంగానే ప్రధాని మోదీ జోక్యం చేసుకున్నారు. "ఇది చాలా తీవ్రమైన విషయం. మొత్తం హిందువులను హింసావాదులనడం తీవ్రమైన విషయం" అన్నారు. దానికి రాహుల్ బదులిస్తూ, "బీజేపీ, మోదీయే మొత్తం హిందూ సమాజం కాదు. ఆరెస్సెస్ మొత్తం హిందూ సమాజం కాదు. హిందూత్వాన్ని బీజేపీకి కాంట్రాక్టు రాసివ్వలేదు" అన్నారు. ఈ సందర్భంగా లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా దేవుళ్ల పటాలను సభలో చూపించడం మీద అభ్యంతరం వ్యక్తం చేశారు. సభలో ప్లకార్డులు ప్రదర్శించడానికి అనుమతి లేదని చెప్పారు. బీజేపీ మైనారిటీలను బెదిరిస్తోందని, ముస్లిములు, సిక్కులు, క్రైస్తవులకు వ్యతిరేకంగా విద్వేషాన్ని, హింసను ప్రేరేపిస్తోందని రాహుల్ ఆరోపించారు. సభలో తాను మాట్లాడేటప్పుడు మోదీ ఎందుకు సీరియస్‌గా ఉంటారని రాహుల్‌గాంధీ ప్రశ్నించగా, విపక్ష నేతను సీరియస్‌గా తీసుకుంటామని, ఆ పదవిని గౌరవించడం రాజ్యాంగం తనకు నేర్పిందని మోదీ అన్నారు. కాగా, మణిపూర్‌ను అంతర్యుద్ధం స్థాయికి తీసుకెళ్లిన మోదీ ఇంతవరకు ఆ రాష్ట్రాన్ని సందర్శించలేదని రాహుల్ అన్నారు. అగ్నివీర్ పథకంతో సైనికులను వాడుకొని వదిలేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని ఆరోపించారు. భారత్ అనే భావన మీద, రాజ్యాంగం మీద బీజేపీ పూర్తి స్థాయిలో ఒక పద్ధతి ప్రకారం దాడి చేస్తోందని రాహుల్‌గాంధీ ఆరోపించారు. చాలామంది విపక్ష నేతల మీద వ్యక్తిగత దాడికి పాల్పడ్డారని, కొందరు ఇప్పటికీ జైళ్లలో ఉన్నారని పరోక్షంగా కేజ్రీవాల్ అరెస్టును ప్రస్తావిస్తూ చెప్పారు.

అవసరమైతే మోదీ పాదాలకు నమస్కరిస్తా..

సభలో రాహుల్‌కు, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు మధ్య కూడా సంవాదం జరిగింది. స్పీకర్ తనతో కరచాలనం చేసినపుడు నిటారుగా నిలబడ్డారని, మోదీతో కరచాలనం చేసినపుడు పూర్తిగా తల వంచారని రాహుల్ ప్రస్తావించారు. దాంతో బీజేపీ సభ్యులు భగ్గుమన్నారు. సభాపతి మీదే రాహుల్‌గాంధీ ఆరోపణలు చేస్తున్నారని మంత్రి అమిత్‌షా మండిపడ్డారు. ప్రధాని సభా నాయకుడని, పెద్దలు నేర్పిన విలువలను అనుసరించి, వయసులో తనకన్నా పెద్దవాడైన మోదీకి తలవంచానని స్పీకర్ బదులిచ్చారు. అవసరమైతే పాదాలకు కూడా నమస్కరిస్తానన్నారు. రాహుల్‌గాంధీ స్పీకర్ అభిప్రాయాన్ని గౌరవిస్తున్నా అంటూనే సభలో స్పీకర్ కన్నా ఎవరూ పెద్ద కాదని గుర్తు చేయదలచుకున్నానని చెప్పారు. మొత్తం విపక్షం తరపున స్పీకర్‌కు తల వంచుతున్నానని అన్నారు. అదే సమయంలో స్పీకర్ ఎవరి ముందూ తలవంచరాదని విజ్ఞప్తి చేశారు.

# ఎల్లుండే తెలంగాణ కేబినెట్ విస్తరణ

**నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్-జులై 01:**

రాష్ట్ర మంత్రివర్గ విస్తరణకు ముహూర్తం ఖరారైంది. జూలై మొదటి వారంలో కేబినెట్ విస్తరణ ఉంటుందని సీఎం రేవంత్‌రెడ్డి తన ఢిల్లీ పర్యటనలో చెప్పిన నేపథ్యంలో.. ఈ నెల 4న మరికొంత మందిని మంత్రివర్గంలో చేర్చుకునే అవకాశముందని సమాచారం. ఈ మేరకు పార్టీ అధిష్టానం కూడా గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిందని గాంధీభవన్ వర్గాలు చెబుతున్నాయి. సీఎం సోమవారం రాష్ట్ర గవర్నర్ సీపీ రాధాకృష్ణన్‌తో భేటీ కావడాన్ని కూడా ప్రస్తావిస్తున్నాయి. కేబినెట్ విస్తరణ గురించి గవర్నర్‌కు రేవంత్ చెప్పారని, 4న అందుబాటులో ఉండాల్సిందిగా కోరారని తెలుస్తోంది. రాధాకృష్ణన్ జార్ఖండ్ గవర్నర్‌గా, పుదుచ్చేరి ఇన్‌చార్జి లెఫ్టినెంట్ గవర్నర్‌గా సైతం వ్యవహరిస్తుండడంతో ఈ విజ్ఞప్తి చేసినట్టు సమాచారం. మంత్రివర్గ కూర్పు గురించి రాజకీయ వర్గాల్లో అనేక ఊహాగానాలు కొనసాగుతుండగా, కాంగ్రెస్ హైకమాండ్ నుంచి రాష్ట్ర కాంగ్రెస్ ముఖ్య నేతలకు మరోమారు పిలుపు వచ్చింది. సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, సీనియర్ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డిలు ఢిల్లీ వెళ్లనున్నారు. అధిష్టానం ఇచ్చిన సమయాన్ని బట్టి మంగళ లేదా బుధవారం వారు హస్తిన చేరుకుంటారని తెలుస్తోంది. ఈ సందర్భంగా మంత్రివర్గ విస్తరణకు సంబంధించిన తుది జాబితాకు ఆమోదముద్ర వేస్తారని, తుది దఫా చర్చల్లో భాగంగా ఇప్పటివరకు స్పష్టత రాని ఒకట్రెండు బెర్తుల విషయంలో నిర్ణయం తీసుకుంటారని సమాచారం. ఇప్పటివరకు ఉన్న సమాచారం ప్రకారం కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, పి.సుదర్శన్‌రెడ్డి, వాకిటి శ్రీహరిల పేర్లు దాదాపు ఖరారయ్యాయని, ప్రేంసాగర్‌రావు, వివేక్‌లలో ఎవరిని ఎంపిక చేయాలన్న దానిపై చర్చలు జరుగుతున్నాయని చెబుతున్నారు. ఈ దఫా నాలుగు బెర్తులు భర్తీ చేస్తారని, ముస్లిం మైనార్టీల కోసం ఒక బెర్తు, ఎస్టీల కోసం మరో బెర్తును ఖాళీగా ఉంచవచ్చని తెలుస్తోంది. ఢిల్లీలో చర్చల అనంతరం ఈ విషయంలో మరింత స్పష్టత రానుంది.

### నాలుగో వారంలో బడ్జెట్ భేటీ!

సీఎం రేవంత్‌రెడ్డి సోమ వారం మధ్యాహ్నం రాజ్‌భవన్‌కు వెళ్లారు. గవర్నర్ సీపీ రాధాకృష్ణన్‌తో దాదాపుగా రెండు గంటల పాటు భేటీ అయ్యారు. అక్కడే మధ్యాహ్న భోజనం చేశారు. కాగా సీఎం పలు అంశాలను గవర్నర్ దృష్టికి తెచ్చినట్లు సమాచారం. మంత్రివర్గ విస్తరణతోపాటు ముఖ్యంగా అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల నిర్వహణపై చర్చించినట్టు తెలిసింది. ఈ నెల 22న కేంద్ర బడ్జెట్ ప్రవేశపెట్టిన పక్షంలో 23, 24 తేదీల్లో..ఒకవేళ 23న కేంద్రం బడ్జెట్ పెట్టినట్లైతే 24 లేదా 25 తేదీల్లో రాష్ట్ర బడ్జెట్ ప్రవేశపెట్టవచ్చని, ఇందుకు అనుగుణంగా అసెంబ్లీ నోటిఫికేషన్ జారీ అవుతుందని సమాచారం.

# హైకోర్టులో కేసీఆర్‌కు ఎదురుదెబ్బ

**నేటి ఫోకస్ న్యూస్, హైదారాబాద్-జులై 01:**

**కమిషన్‌ను రద్దు చేయాలంటూ ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు కొట్టేసింది. విచారణ కమిషన్‌ను ఏర్పాటు చేసే పరిధి ప్రభుత్వానికి లేదని, తనకు కమిషన్ ఇచ్చిన నోటీసులు కొట్టేయాలని, కమిషన్ ప్రెస్‌మీట్ పెట్టడం ద్వారా పక్షపాతం చూపించిందంటూ కేసీఆర్ పేర్కొనడాన్ని తప్పుబట్టింది. కమిషన్‌ను ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని సమర్థించింది.**

బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు వేసిన రిట్ పిటిషన్‌ను తెలంగాణ హైకోర్టు కొట్టేసింది. విద్యుత్ కమిషన్ విచారణను రద్దు చేయాలంటూ ఆయన అత్యున్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించిన సంగతి తెలిసిందే. అయితే ప్రభుత్వ వాదనలతోనే ఏకీభవించిన హైకోర్టు ధర్మాసనం.. కేసీఆర్ పిటిషన్‌ను కొట్టేస్తున్నట్లు సోమవారం ఉదయం వెల్లడించింది. బీఆర్ఎస్ హయాంలో విద్యుత్ కొనుగోళ్లలో అవకతవకలు జరిగాయంటూ కాంగ్రెస్, జస్టిస్ నరసింహారెడ్డి నేతృత్వంలో కమిషన్ వేసింది. ఈ కమిషన్ మాజీ సీఎం కేసీఆర్‌కు విచారణకు హాజరు కావాల్సిందిగా నోటీసులు సైతం జారీ చేసింది. దీంతో.. ఆయన హైకోర్టులో రిట్ పిటిషన్ వేయగా, దీని విచారణ అర్హతపై ఇరు వర్గాలు వాదనలు వినిపించాయి. విద్యుత్ కొనుగోళ్లలో ఎక్కడా అవకతవకలు జరగలేదని.. సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధంగా కమిషన్ ఏర్పాటైందని కేసీఆర్ తరపు న్యాయవాది ఆదిత్య సోందీ వాదించారు. అయితే.. పద్ధతి ప్రకారమే విచారణ జరుగుతోందని, ట్రాన్స్‌కో జెన్‌కో అధికారుల్ని సైతం విచారించిందని,ఈ పిటిషన్‌కు అసలు విచారణ అర్హత లేదని ప్రభుత్వం తరుపున ఏజీ సుదర్శన్‌రెడ్డి వాదనలు వినిపించారు. దీంతో ఏజీ వాదనలతో ఏకీభవించిన హైకోర్టు కేసీఆర్ రిట్ పిటిషన్‌ను కొట్టేసింది. దీంతో గులాబీ బాస్ తర్వాత ఏం చేయబోతున్నారో? అనే ఆసక్తి నెలకొంది.

ఛత్తీసగఢ్ నుంచి విద్యుత్తు కొనుగోలు చేయాలన్న అప్పటి ప్రభుత్వ నిర్ణయాన్ని.. భద్రాద్రి, యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ల నిర్మాణాలపై తీసుకున్న నిర్ణయాలను ఇప్పటికే ఈఆర్సీ విచారించింది కదా? మళ్లీ దానిపై విచారణ చేపట్టే పరిధి కమిషన్ ఉందా? అనే ప్రశ్నకు ధర్మాసనం బదులిస్తూ, '2015లో తెలంగాణ, ఛత్తీసగఢ్ రాష్ట్రాల విద్యుత్తు సంస్థల మధ్య పీపీఏలు జరిగాయి. ఈ ఒప్పందాలను, టారిఫలను వ్యతిరేకిస్తూ పలువురు ఈఆర్సీని ఆశ్రయించారు. ఈఆర్సీ బహిరంగ విచారణ చేపట్టి 2017లో తీర్పు వెల్లడించింది. అలాగే ఛత్తీసగఢ్ ఈఆర్సీ సైతం 2018లో టారిఫలను నిర్ధారించింది. ఈ తీర్పులపై అప్పీళ్లు దాఖలు కాగా.. అవి అప్పీలేట్ ట్రైబ్యునల్‌లో పెండింగ్‌లో ఉన్నాయి. తెలంగాణ, ఛత్తీసగఢ్ ఈఆర్సీలు ఇచ్చిన తీర్పు కాపీలను పిటిషనర్ సమర్పించకపోయినా.. అఫిడవిట్ ద్వారా ఈ వ్యవహారంపై రెండు రాష్ట్రాల ఈఆర్సీలు విచారణ చేపట్టినట్లు స్పష్టమవుతోంది.

ప్రభుత్వం విద్యుత్తు కమిషన్‌కు అప్పగించిన అంశాల్లో ఈఆర్సీ విచారించిన అంశాల కంటే విస్తృతమైన అంశాలున్నాయి. కమిషన్ గుర్తించిన లోపాలకు, ఆర్థికపరమైన నష్టాలకు బాధ్యులు ఎవరో గుర్తించే బాధ్యతను సైతం కమిషన్‌కు అప్పగించారు. మరోవైపు ఈఆర్సీ ఇప్పటికే విచారించిన అంశాలపై టారిఫ్ నిర్ధారణ వంటి విషయాలు ప్రస్తుత విద్యుత్తు కమిషన్‌కు అప్పగించిన బాధ్యతల్లో లేవు. ఈ నేపథ్యంలో ఇప్పటికే ఈఆర్సీ విచారించిన అంశాలపై విచారించే అధికార పరిధి ఎంక్వైరీ కమిషన్‌కు లేదనే వాదన ఆమోదయోగ్యం కాదు. ఈఆర్సీ విచారించినవి, కమిషన్‌కు అప్పగించిన అంశాలు వేర్వేరు అయినందున కమిషన్‌కు పరిధి ఉంటుంది" అని ధర్మాసనం వివరించింది.

కమిషన్ పక్షపాత, వివక్షాపూరిత ధోరణితో వ్యవహరిస్తోందా? ప్రెస్‌మీట్ పెట్టడం ద్వారా తన ఎదుట ఉన్న వ్యవహారాలపై ముందే ఓ నిర్ణయం ప్రకటించిందా? అనే ప్రశ్నకు ధర్మాసనం సమాధానం ఇస్తూ, 'పిటిషనర్ (కేసీఆర్) ప్రతివాదిగా చేర్చిన మూడో ప్రతివాది కమిషన్ చైర్మన్ జస్టిస్ ఎల్.నర్సింహారెడ్డికి నోటీసులు జారీ చేయాలంటే పక్షపాతం అనే అంశంపై ముందుగా ఈ కోర్టు సంతృప్తి చెందాల్సి ఉంటుంది. కమిషన్ చైర్మన్ ఏప్రిల్ 14న పిటిషనర్‌కు నోటీసులు జారీచేశారు. పార్లమెంట్ ఎన్నికలు జరుగుతున్నందున రాలేనని, సమయం పొడిగించాలని మే 1న పిటిషనర్ సమాధానం ఇచ్చారు. మళ్లీ కమిషన్ పిటిషనర్‌కు లేఖ రాస్తూ మూడు నెలల్లో రిపోర్ట్ ఇవ్వాల్సి ఉందని.. మే 13న ఎన్నికలు ముగుస్తున్నందున మే 31 లేదా జూన్ 15 లోపు మీకు తగిన సమయాన్ని వెల్లడించండని కోరింది.

ఆ తర్వాత జూన్ 11న కమిషన్ చైర్మన్ ప్రెస్‌మీట్ నిర్వహించారు. ఆ ప్రెస్‌మీట్‌కు సంబంధించిన ఆంగ్ల తర్జుమాను పరిశీలించాం. ఇందులో.. తన ఎదుట కొనసాగుతున్న ప్రొసీడింగ్స్ స్టేట్‌సను కమిషన్ మీడియాకు వెల్లడించింది. కమిషన్ చైర్మన్ ముందే ఓ నిర్ణయానికి వచ్చేశారని చెప్పడానికి ఇందులో ఎలాంటి ఆధారాలు కనిపించడం లేదు. తన ముందున్న మెటీరియల్ ఆధారంగా తాను తెలుసుకున్న అంశాలను రికార్డు చేయడం కమిషన్ విధి. కమిషన్ చైర్మన్ చీఫ్ జస్టిసగా రాజ్యాంగబద్ధమైన పదవి నిర్వహించారనే విషయం మరిచిపోరాదు. కేవలం మీడియాలో వచ్చిన కథనాల ఆధారంగా కమిషన్ చైర్మన్ వ్యక్తిగత పక్షపాతంతో వ్యవహరించారనే ఆరోపణ చేస్తున్నారే తప్ప మరే ఆధారం లేదు. పక్షపాతం చూపించారనే ఆరోపణ కేవలం ఊహించుకోవడం ద్వారా చేయకూడదు.. దానిని నిరూపించాల్సి ఉంటుంది. ఈ పరిస్థితుల్లో పక్షపాతం అనే ఆరోపణను నిరూపించడంలో పిటిషనర్ విఫలమయ్యారు. ఈ మేరకు అన్ని అంశాలకు సమాధానం లభించింది. అలాగే ప్రభుత్వం జారీచేసిన కమిషన్ ఏర్పాటు జీవో, సెక్షన్ 8(బీ) కింద కమిషన్ పిటిషనర్‌కు ఇచ్చిన నోటీసు కమిషన్ ఆఫ్ ఎంక్వైరీస్ యాక్ట్ - 1952కు విరుద్ధంగా ఉందన్న వాదన సైతం ఆమోదయోగ్యం కాదు. పిటిషనర్ నిర్ణయాలు తీసుకునే ప్రక్రియలో పాల్గొన్నట్లు ప్రాథమిక నిర్ధారణకు వచ్చిన తర్వాతే నోటీసు జారీచేస్తున్నట్లు కమిషన్ పేర్కొంది' అని ధర్మాసనం తీర్పులో వెల్లడించింది. ఎంక్వైరీ కమిషన్ అనేది నిజనిర్ధారణ సంఘం మాత్రమేనని, ఆ కమిషన్ ఇచ్చిన రిపోర్ట్‌ను ప్రభుత్వం అమలు చేయవచ్చు.. చేయకపోనూ వచ్చని తెలిపింది. కమిషన్ ఇచ్చే నివేదికను అపాయింటింగ్ అథారిటీ అయిన ప్రభుత్వం అంగీకరించవచ్చు.. తిరస్కరించవచ్చని, కమిషన్ ఇచ్చే నివేదిక అంతిమమూ కాదు.. దానికి నిర్ణయాత్మక శక్తీ ఉండదని పేర్కొంది. తన నివేదికను అమలు చేసే అధికారం సైతం కమిషన్‌కు లేదని స్పష్టం చేసింది. ఈ మేరకు మాజీ సీఎం కేసీఆర్ దాఖలు చేసిన పిటిషన్‌ను అడ్మిషన్ దశలోనే కొట్టేసింది.

## అనుమతి లేని బిఆర్ఎస్ కార్యాలయం కూల్చేయండి

(మొదటి పేజీ తరువాయి..)

దానిని వెంటనే కూల్చివేయాలని అన్నారు. మంత్రిగా తాను ఆదేశాలు జారీ చేస్తున్నానని చెప్పారు. ఆగస్టు 15లోపు 32 వేల కోట్ల రూపాయలతో రుణమాఫీ చేస్తున్నామని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. రైతులకు రెండు లక్షల రుణమాఫీని ఏకకాలంలో చేస్తున్నామన్నారు. ఏడు లక్షల కోట్ల అప్పు ఉండి కూడా సీఎం రేవంత్ రెడ్డి రైతులకు రుణమాఫీ చేయడానికి ముందుకు వెళ్తున్నారని చెప్పారు. పైసా పైస పోగు చూసి రైతులకు సహాయం చేస్తున్నామన్నారు. యావత్ తెలంగాణ రైతులకు అండగా ఉంటామని ఆయన అన్నారు. గత ప్రభుత్వాలు చేసిన రైతు రుణమాఫీ వల్ల రైతులకు ప్రయోజనం కలగలేదన్నారు. కాంగ్రెస్ పార్టీ రైతు పక్షపాతి అని, అందుకు రైతు రుణమాఫీ ఒక ఉదాహరణ అని పేర్కొన్నారు. నాగార్జునసాగర్, ఏఎంఆర్పీ ప్రాజెక్టుల కింద లక్షల మంది రైతులు బత్తాయి రైతులు ఉన్న జిల్లాగా నల్గొండ జిల్లాకు పేరున్నదన్నారు.

## నాగర్‌కర్నూల్‌లో విషాదం

### ఇంటిమిద్దె కూలి నలుగురు దుర్మరణం

**నేటి ఫోకస్ న్యూస్, నాగర్‌కర్నూల్-జూలై1:**

నాగర్‌కర్నూలు మండలంలోని వనపట్లలో విషాదం చోటుచేసుకున్నది. మట్టిమిద్దె కూలి ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మృతి చెందారు. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. జిల్లాలో ఆదివారం రాత్రి భారీ వర్షం కురిసింది. దీంతో వనపట్లకు చెందిన గొడుగు భాస్కర్‌కు చెందిన ఇళ్లు కుప్పకూలింది. దీంతో ఇంట్లో నిద్రిస్తున్న పద్మతోపాటు ఆమె ఇద్దరు కుమార్తెలు తేజస్విని (6) వసంత (9), కుమారుడు రిత్విక్ అక్కడికక్కడే మరణించారు. తండ్రి భాస్కర్ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు భాస్కర్‌ను ప్రభుత్వ దవాఖానకు తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. మట్టిపెళ్లలు తొలగించి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం జిల్లా దవాఖానకు తరలించారు. ఇళ్లు కూలిన ప్రదేశాన్ని ఆర్డీవో, ఎమ్మార్వో పరిశీలించారు. వానాకాలం కావడంతో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. పాత ఇండ్లు ఉన్నవారు తాత్కాలికంగా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. కాగా, ఒకే కుటుంబంలో నలుగురు మరణించడంతో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. నిరుపేద కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్తులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

# విపత్తుల నిర్వహణ ఇక హైడ్రాగా మార్పు

- విభాగానికి బాధ్యతలు అప్పగించాలని నిర్ణయం
- పరిధిని అవుటర్ రింగ్ రోడ్డు వరకు విస్తరణ
- అధికారులతో సమీక్షలో సీఎం రేవంత్ ఆదేశాలు



**నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్-జూలై1:** గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో విపత్తుల నిర్వహణ విభాగానికి అత్యంత కీలక బాధ్యతలు అప్పగించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయించారు. అందుకు అనుగుణంగా వ్యవస్థాగత మార్పులతో పాటు, బాధ్యతల పంపిణీ జరగాలని అధికారులకు సూచించారు. సచివాలయంలో సోమవారం సాయంత్రం మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, హెచ్ఎండీఏ, మూసీ డెవెలప్మెంట్ అధికారులతో ముఖ్యమంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. హైదరాబాద్ భౌగోళిక పరిధిని విస్తరించనున్న దృష్ట్యా విపత్తుల నిర్వహణ విభాగం పరిధిని కూడా అవుటర్ రింగ్ రోడ్డు వరకు విస్తరించాలని ఆదేశించారు. జీహెచ్ఎంసీ, దాని చుట్టూ ఉన్న 27 మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు, 33 గ్రామ పంచాయతీల వరకు ఈ విభాగం సేవలు అందించేందుకు అవసరమైన మార్పులు చేయాలని సూచించారు. ఇకపై ఈ విభాగాన్ని హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్స్ మానిటరింగ్ ప్రొటెక్షన్ (హైడ్రా) అని పేరు పెట్టాలని ప్రాథమికంగా నిర్ణయం తీసుకున్నారు. డీఐజీ స్థాయి అధికారి ఈ విభాగానికి డైరెక్టర్గా, ఎస్పీ స్థాయి అధికారులు అడిషనల్ డైరెక్టర్లుగా ఉండేలా చూడాలని సీఎం చెప్పారు. జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, వాటర్ బోర్డు, సిటీ ట్రాఫిక్, వివిధ విభాగాల నుంచి ప్రత్యేక టీమ్లు ఈ విభాగంలో నియమించాలని సూచించారు. కేవలం వరదలు, ప్రమాదాలు సంభవించినప్పుడే కాకుండా ఇకపై విపత్తుల నిర్వహణ విభాగం సిటీ ప్రజలకు నిరంతరం సేవలు అందించేలా పునర్వ్యవస్థీకరణ జరగాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. నగరంలో ప్రజలు ఎదుర్కొనే సమస్యలన్నింటిలో హైడ్రా క్రియాశీలంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. దాదాపు రెండు వేల కిలోమీటర్ల జీహెచ్ఎంసీ పరిధిలో ఉన్న చెర్వులు, కుంటలను పరిరక్షించటం, సిటీలోని నాలాలు, ప్రభుత్వ ఆస్తులు ఆక్రమణలకు గురవకుండా కాపాడే కీలక బాధ్యతలను ఈ విభాగమే చేపట్టాలని నిర్ణయించారు. దీంతో పాటు హోర్డింగులు, ఫ్లెక్సీల నియంత్రణ, తాగు నీటి పైపులైన్లు, విద్యుత్తు సరఫరా లైన్లు, డ్రైనేజీలు, వరద నిర్వహణ, ట్రాఫిక్ నియంత్రణ వ్యవహారాలన్నింటిలోనూ ఈ విభాగం సేవలను అందిస్తుంది. అందుకు వీలుగా ఈ విభాగం పునర్వ్యవస్థీకరణ, సిబ్బంది, విధులు, నిధుల కేటాయింపు, బాధ్యతలపై ముసాయిదా సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారిని ఆదేశించారు. ఔసీ రివర్ డెవెలప్మెంట్ ప్రాజెక్టు పనులను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఈ ప్రాజెక్టు హైదరాబాద్ సిటీకి అంతర్జాతీయ ఖ్యాతి తెచ్చేలా తీర్చిదిద్దాలనే ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా పని చేయాలని అధికారులను సీఎం అప్రమత్తం చేశారు. హైదరాబాద్ సిటీలోని చారిత్రక ప్రాధాన్యమున్న కట్టడాలు, శిథిలమైన నిర్మాణాలను పునరుద్ధరించేందుకు తగిన చర్యలు చేపట్టాలని సీఎం ఆదేశించారు. సిటీ లైబ్రరీ, చార్మినార్ సమీపంలోని ఆయుర్వేద హాస్పిటల్, నిజామియా అబ్జర్వేటరీ, గుడిమల్కాపూర్ కోనేరు లాంటి వివిధ చారిత్రక ప్రదేశాలపై జీహెచ్ఎంసీ పవర్ పాయింట్ ప్రజంటేషన్ను ప్రదర్శించింది. వాటిని పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు ఉన్న వివిధ మార్గాలను అన్వేషించాలని సీఎం సూచించారు. వీటిలో మూసీ రివర్ డెవెలప్మెంట్ ప్రాజెక్టులో అనుసంధానం చేసేందుకు వీలైన వాటిని గుర్తించి, అందులోనే జోడించాలని సీఎం సూచించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్ మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ దానకిషోర్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి, జీహెచ్ఎంసీ విజిలెన్స్ విపత్తు నిర్వహణ కమిషనర్ ఏవీ రంగనాథ్, హైదరాబాద్ వాటర్ బోర్డు ఎండీ అశోక్ రెడ్డి ఈ సమావేశంలో పాల్గొన్నారు.



## అంతర్జాతీయ డాక్టర్స్ డే సందర్భంగా డాక్టర్ అనురాధకు సన్మానం



**ఉమ్మడి మహబూబ్నగర్ ప్రతినిధి, (నేటి ఫోకస్ న్యూస్)-చారగొండ వెంకటేష్ జులై 1:**

అంతర్జాతీయ డాక్టర్స్ డే సందర్భంగా అమ్రాబాద్ మండల జడ్పిటిసి డాక్టర్ అనురాధకు మన్ననూర్ కాంగ్రెస్ కార్యకర్తలు సోమవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సీనియర్ కాంగ్రెస్ కార్యకర్త సంభు వెంకటరమణ మాట్లాడుతూ..... వృత్తులలో గౌరవమైన వృత్తి అంటే అది వైద్యమేనన్నారు. ఆపదలో ఉన్న ప్రజల ప్రాణాలు నిలుపుతున్న డాక్టర్లను దైవ సమానులతో పూజిస్తారన్నారు. అందుకే వైద్యం నారాయణ అని గతంలోని పెద్దలు చెప్పారన్నారు. డాక్టర్ అనురాధతో పాటు తన భర్త అయినటువంటి ప్రస్తుత ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ, కూతుర్ని, కుమారుని కూడా డాక్టర్ లు అయిన ఘనత ఆ కుటుంబానికి దక్కిందన్నారు. ఆ కుటుంబంలో అందరూ డాక్టర్ లే కావడంతో ఎంతోమందికి ఆపదలో ఉన్న వారికి ప్రాణాలు పోస్తూ ఒకపక్క ప్రజా సేవకులుగా నిలుస్తూ అందరి మన్ననాలు పొందుతున్నారని తెలిపారు. ఆ కుటుంబానికి భగవంతుని శేష వస్త్రంతో సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి శ్రీనివాసులు, మండల కోషన్ నెంబర్ అబ్దుల్ రహీం, మాజీ వైస్ ఎంపీపీ శంభు శోభ, వెంకటరమణ, జూలూరు సత్యనారాయణలతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## నిరుద్యోగల పక్షాన జేఏసీ ఆందోళన ఓయూలో మద్దతుకు విద్యార్థుల దీక్ష

**నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్-జూలై1:** రాష్ట్రంలోని నిరుద్యోగుల సమస్యలపై నిరుద్యోగ జేఏసీ ఉద్యమ నాయకుడు మోతీలాల్ నాయక్ ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న సంగతి తెలిసిందే. ఆయన గాంధీ ఆస్పత్రిలోనూ దీక్ష కొనసాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో మోతీలాల్ నాయక్ ఆమరణ దీక్షకు మద్దతుగా ఉస్మానియా యూనివర్సిటీలో నిరుద్యోగులు నిరసన చేపట్టారు. నిరుద్యోగుల డిమాండ్లు నెరవేర్చాలని ఆర్ట్స్ కాలేజీ ముందు ధర్నాకు దిగారు. గ్రూప్-1 మెయిన్స్ ఎలిజిబిలిటీ 1:100కు పెంచాలి. గ్రూప్-2లో 2000, గ్రూప్-3లో 3000 ఉద్యోగాలు కలపాలి. వెంటనే జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలి 25వేల పోస్టులతో మెగా డీఎస్సీ ప్రకటించాలి. నిరుద్యోగుల పక్షాన ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న ఉస్మానియా విద్యార్థి నేత మోతీలాల్ నాయక్కు బీఆర్ఎస్ సహా వివిధ పక్షాలు పెద్ద ఎత్తున మద్దతు ఇస్తున్నాయి. ఆదివారం గాంధీ దవాఖానకు వెళ్లిన ఎమ్మెల్యే హరీశ్రావు సహా పలువురు నేతలు మోతీలాల్ నాయక్ను పరామర్శించి, ఆయన ఆరోగ్య పరిస్థితిని వైద్యుల ద్వారా అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రంలోని అన్ని విద్యార్థి, నిరుద్యోగ జేఏసీ, యువజన నేతలు, ఓయూ ప్రొఫెసర్లు నిరుద్యోగుల ఉద్యమానికి మద్దతుగా నిలుస్తున్నారు.

## పివి ఎక్స్ప్రెస్వేపై ప్రమాదం

**అతివేగంగా వచ్చి పల్టీలు కొట్టిన కారు**

**ప్రమాదంలో గణేళిశ్ అనే యువకుడు దుర్మరణం**

**నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్-జూలై1:** హైదరాబాదం నగరంలోని పివిఎన్ఆర్ ఎక్స్ప్రెస్ వేపై సోమవారం తెల్లవారుజామున కారు రేసింగ్లో రోడ్డు ప్రమాదం జరిగింది. కారు రయ్ రయ్ అంటూ దూసుకొని వచ్చి పల్టీలు కొట్టింది. పిల్లర్ నెంబర్ 296 వద్ద థార్ కారు డివైడర్ను ఢీకొట్టి పల్టీలు కొట్టింది. ఐదు, ఆరు పల్టీలు కొట్టి రోడ్డుకు అడ్డంగా కారు పడిపోయింది. కారులో ప్రయాణిస్తున్న గణెళిష్ అనే యువకుడు మృతి చెందాడు. దీంతో భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ట్రాఫిక్ పోలీసులు హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకొని ట్రాఫిక్ ను మళ్లించారు. మృతదేహాన్ని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మితిమీరిన వేగమా మద్యం మత్తులో కారు డ్రైవ్ చేసారా? అనే కోణంలో విచారణ చేస్తున్నారు. కారు నుజ్జు నుజ్జుగా మారింది. కారులో ఎంత మంది ప్రయాణిస్తున్నారు అనే సమాచారాన్ని పోలీసులు స్వీకరిస్తున్నారు.

## భూవివాదం కలకలం

**- జనగామ కలెక్టరేట్లో ఆత్మహత్యకు యత్నం**

**నేటి ఫోకస్ న్యూస్, జనగామ-జూలై1:** జనగామ కలెక్టరేట్లో ఓ మహిళా ఆత్మహత్యాయత్నానికి పాల్పడటం స్థానికంగా కలకలం రేపింది. ఇటీవలే భూ వివాదం నేపథ్యంలో ఓ రైతు పురుగుల మందు తాగి కలెక్టరేట్ భవనం పైకెక్కి బలవన్మరణానికి ప్రయత్నించాడు. ఆ సంఘటన మరవక ముందే తాజాగా జనగామ జిల్లా నర్మెట మండలానికి చెందిన దేవరపల్లి జ్యోతి తన వ్యవసాయ భూ సమస్య విషయమై ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించడం అధికార వర్గాల్లో ఆందోళన కలిగిం చింది. భూ వివాదంలో జ్యోతి గత కొద్ది రోజులుగా అధికారుల చుట్టూ తిరిగినా, పట్టించుకోవడంలేదని మనస్థాపం చెంది సోమవారం కలెక్టరేట్లో ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించింది. గమనించిన పోలీసులు ఆమెను అడ్డుకున్నారు. అయితే అప్పటికే ఇంటివద్ద నిద్ర మాత్రలు మింగి ఇద్దరు పిల్లలతో కలిసి కలెక్టరేట్లో జరిగే ప్రజావాణికి జ్యోతి వచ్చినట్లు సమాచారం. ప్రస్తుతం జ్యోతిని చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వ ప్రధాన హాస్పిటల్కు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## ఇందిరమ్మ ఇళ్లతో పేదింటి కల నెరవేరుస్తాం..

- బడ్జెట్లో నిధుల కేటాయింపు చేయిస్తాం
- అధికారులతో సమీక్షలో మంత్రి పొంగులేటి

**నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్-జూలై1:** పేద ప్రజలను దృష్టిలో పెట్టుకొని ఇందిరమ్మ ఇండ్ల పథకానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. అధికారంలోకి వచ్చిన రెండు నెలలకే ఈ పథకాని భద్రాచలం రాములవారి సన్నిధిలో ప్రారంభించామని చెప్పారు. ఈ ఏడాది పెద్ద ఎత్తున ఇందిరమ్మ ఇండ్లను నిర్మించబోతున్నామని ఇందుకు అనుగుణంగా వచ్చే బడ్జెట్లో నిధుల కేటాయింపులు కూడా జరుపుతున్నామని వెల్లడించారు. సచివాలయంలో హౌసింగ్ పై ఆయన సమీక్ష నిర్వహించారు. వచ్చే ఐదు సంవత్సరాల్లో రాష్ట్ర వ్యాప్తంగా 22.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లను నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు మంత్రి పొంగులేటి, మొదటి దశలో ఈ ఏడాది నియోజకవర్గానికి 3 వేల500 ఇండ్ల చొప్పున 4 లక్షల16 వేల 500 ఇండ్లు, రిజర్వ్ కోట కింద 33 వేల 500 ఇండ్లు నిర్మించాలని నిర్ణయించామన్నారు. ఇందుకు అవసరమైన 22 వేల 500 కోట్ల రూపాయలను బ్జడెట్లో కేటాయించాలని ఆర్థిక శాఖ మంత్రికి వెల్లడించామన్నారు. గడచిన పది సంవత్సరాలలో సొంత ఇంటి సాకారం అనేది పేదవారికి అందని ద్రాక్షలా మారిందని మంత్రి పొంగులేటి ఆవేదం వ్యక్తం చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రతి గ్రామంలో నిర్మించిన ఇందిరమ్మ ఇండ్లు ఇప్పటికి కనిపిస్తున్నాయని అన్నారు. పేదలు ఆత్మగౌరంతో బతకాలన్న ఆలోచనతో ఇందిరమ్మ ఇండ్ల పథకానికి శ్రీకారం చుట్టామని, రాష్ట్ర ప్రభుత్వ ప్రాధాన్యతను గుర్తించి పనిచేయాలని అధికారులకు సూచించారు. రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇవ్వడమే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు.

## కేసీఆర్‌కు మరో చాన్స్ ఇద్దామా!

- లేఖ రాసే యోచనలో జస్టిస్ నర్సింహారెడ్డి కమిషన్
- విద్యుత్తు రఘు, కోదండరామ్‌ను క్రాస్ ఎగ్జామిన్
- చేయడానికి కేసీఆర్‌కు అవకాశంపై పరిశీలన

**నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్-జూలై 1:** ఛత్తీసగఢ్తో విద్యుత్తు ఒప్పందం, భద్రాద్రి, యాదాద్రి థర్మల్ ప్లాంట్ల నిర్మాణంలో వచ్చిన ఆరోపణలపై మాజీ సీఎం కేసీఆర్‌కు మరోసారి లేఖ రాసే అంశాన్ని జస్టిస్ ఎల్.నర్సింహారెడ్డి కమిషన్ పరిశీలిస్తోంది. ఆరోపణలు చేసిన విద్యుత్తు రంగ నిపుణులు, ఇతర ఫిర్యాదుదారులను ప్రశ్నించే (క్రాస్ ఎగ్జామిన్) అవకాశం కేసీఆర్‌కు ఇవ్వాలా? లేక వారి ఫిర్యాదులను పరిగణనలోకి తీసుకోవాలా? అనే దానిపై కమిషన్ మంగళవారం నిర్ణయం తీసుకోనుంది. పోటీ బిడ్డింగ్ లేకుండా ఛత్తీసగఢ్తో విద్యుత్తు కొనుగోలు ఒప్పందం చేసుకోవడం, భద్రాద్రి, యాదాద్రి థర్మల్ ప్లాంట్‌లను నామినేషన్ పద్ధతిలో నిర్మించే బాధ్యతను కట్టబెట్టడంపై కమిషన్ విచారణ జరుపుతున్న విషయం తెలిసిందే. అయితే ఈ నిర్ణయాలకు కేసీఆరే కారకుడంటూ విద్యుత్తు నిపుణులు కంచర్ల రఘు, ఎం.తిమ్మారెడ్డి, ఎం.వేణుగోపాల్‌రావు, టీజేఎస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరామ్.. నర్సింహారెడ్డి కమిషన్‌కు నివేదించారు. ఈ ఫిర్యాదులను పరిగణనలోకి తీసుకున్న కమిషన్.. వారిని క్రాస్ ఎగ్జామిన్ చేయడానికి కేసీఆర్‌కు అవకాశం ఇస్తూ కేసీఆర్‌కు లేఖ రాసింది. ఈ లేఖపై వారం రోజుల్లో స్పందించాలని కోరింది. కానీ, కేసీఆర్ మాత్రం కమిషన్ ఏర్పాటునే సవాలు చేశారు. కమిషన్‌ను రద్దు చేయాలంటూ న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. అయితే కేసీఆర్ పిటిషన్‌ను కోర్టు కొట్టివేసింది. కమిషన్‌ను రద్దు చేసేందుకు నిరాకరించింది. దీంతో సాక్షులను ప్రశ్నించేందుకు వీలుగా కేసీఆర్‌కు మరో అవకాశం ఇవ్వాలా? లేకవారి ఫిర్యాదులను సాక్ష్యాలుగా పరిగణించాలా? అని కమిషన్ యోచిస్తోంది. సహజ న్యాయసూత్రాల ప్రకారం ఎవరైనా సాక్షులు ఆరోపణలు చేస్తే.. వారిని క్రాస్ ఎగ్జామిన్ చేసే అవకాశం న్యాయస్థానం/కమిషన్ ఇస్తుంది.

## నల్లగొండ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తా: కోమటిరెడ్డి

**నేటి ఫోకస్ న్యూస్, నల్లగొండ-జూలై1:** నల్లగొండ అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తానని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమిటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. సోమవారం నల్లగొండ పట్టణంలోని బీట్ మార్కెట్ వద్ద మూడు కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించనున్న 33/11 కె ఓ సబ్ స్టేషన్ పనులకు శంకుస్థా పన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ సబ్ స్టేషన్ నిర్మాణంతో వోల్టేజీ సమస్యను అధిగ మించ వచ్చని తెలిపారు. రెండు నెలల్లో సబ్ స్టేషన్ నిర్మాణ పనులను పూర్తి చేయాలని కాంట్రాక్టర్, ఇంజినీర్లను మంత్రి ఆదేశంచారు. నాణ్యమైన కేబుల్తో పాటు, ఫెన్సింగ్ వేయాలని, 24 గంటలు సెక్యూరిటీ గాడ్గన్ ఏర్పాటు చేయాలన్నారు. రాబోయే రోజుల్లో ఇబ్బందులు లేకుండా మరో మూడు సబ్ స్టేషన్లు సిద్ధం చేయాలని విద్యుత్ శాఖ అధికా రులనుఆదేశించారు. నల్లగొండ పట్టణంలో తాగునీటి సమస్యను అధికమించేందుకు 10 ఎంఎడీ వాటర్ ట్యాంక్ నిర్మాణానికి రూ.30 కోట్ల మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ ఆస్తులను కాపాడాలని అధికా రులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి, మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, ట్రాన్స్కో ఎస్ఈ చంద్రమోహన్, ఆర్డీవో రవి, తదితరులు ఉన్నారు.

## జిల్లాలో సీతక్క పర్యటనలో ప్రోటోకాల్ వివాదం

**- మంత్రి తీరుపై ఎమ్మెల్యే కోవ లక్ష్మి విమర్శలు**

**నేటి ఫోకస్ న్యూస్, ఆసిఫాబాద్-జూలై1:** జిల్లాలో మంత్రి సీతక్క పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అయితే మంత్రి సీతక్కపై ఎమ్మెల్యే కోవ లక్ష్మి ఫైర్ అయ్యారు. మంత్రి అధికారిక కార్య కమాలకు ప్రోటోకాల్ పాటించలేదని ఆరోపించారు. ప్రోటోకాల్ తెలియకుండా సీతక్క మంత్రి ఎలా అయిందోనని ఎద్దేవా చేశారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్‌కు ప్రోటోకాల్ ఉల్లంఘనపై ఫిర్యాదు చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాజకీయంలో గెలుపు, ఓటములు సహజం. అధికారంలో శాశ్వతం కాదన్నారు. ఈరోజు ఉన్నట్టు రేపు ఉండదన్నారు. రాజకీయ పదవులు ఇచ్చేది ప్రజలు. ప్రజల కోసం పని చేయాలి. ప్రభుత్వ అధికారిక కార్యక్రమాల్లో పార్టీ అనే తేడా లేకుండా ప్రోటోకాల్ ఉన్న నాయకులను స్వాగతించడం అనేది రాజకీయ నాయకుల కనీస లక్షణం అన్నారు. ఇవేవి తెలియకుండా మంత్రి రాజకీయంలో ఉండడం సిగ్గుచేటని మండిపడ్డారు.

## రాష్ట్రపతి ప్రసంగంపై చర్చ

**- లోక్‌సభ నుంచి విపక్షం వాకౌట్**

**నేటి ఫోకస్ న్యూస్, న్యూఢిల్లీ-జూలై1:** పార్లమెంటు సమావేశాలు ఆరోరోజు సోమవారం ఉదయం తిరిగి ప్రారంభమయ్యాయి. నీట్‌పై చర్చ చేపట్టాలని డిమాండ్ చేస్తూ ప్రతిపక్షాలు సభ నుండి వాకౌట్ చేశాయి. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగంపై బిజెపి నేత అనురాగ్ ఠాకూర్ చర్చను ప్రారంభించడంతో ప్రతిపక్ష సభ్యులు సభ నుండి వాకౌట్ చేశారు. ప్రతిపక్ష నేతగా ఎంపికైన రాహుల్ గాంధీకి బిజెపి ఎంపి అభినందనలు తెలిపారు. ఇన్నాళ్లూ రాహుల్ గాంధీ బాధ్యత లేకుండా అధికారంలో కొనసాగారని, ఇప్పుడు ఆయనకు అధికారంతో పాటు బాధ్యత కూడా వహించాల్సి వుంటుందని అన్నారు.



## కెసిఆర్ నియంతృత్వ వారసత్వాన్ని కొనసాగిస్తున్న సీఎం రేవంత్ రెడ్డి

- గాంధీ హాస్పిటల్ లో తన ఆరోగ్యం సహకరించకున్న దీక్ష, మోతిలాల్ కు ఏం జరిగినా ప్రభుత్వానిదే బాధ్యత
- నిరుద్యోగ సమస్యలపై అమరుల నిరాహార దీక్ష చేస్తున్న మోతిలాల్ కు ధర్మ స్టూడెంట్స్ యూనియన్ సంపూర్ణ మద్దతు

**ఫోకస్ న్యూస్, సికింద్రాబాద్ కంటోన్మెంట్ జూలై 01:** నిరుద్యోగుల డిమాండ్ల పరిష్కారం కోసం గత ఎనిమిది రోజులుగా ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న మోతిలాల్ నాయక్ కు, ఓయూ జేఏసీ, ధర్మ స్టూడెంట్స్ యూనియన్ సంపూర్ణ మద్దతు ఇస్తున్నామని, ధర్మ స్టూడెంట్స్ యూనియన్ రాష్ట్ర కన్వీనర్ కార్తీక్ మహారాజ్ తెలిపారు. ధర్మ స్టూడెంట్స్ యూనియన్, ఓయూ జెఏసి ఆధ్వర్యంలో భారీ ర్యాలీ ధర్నా కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ధర్మా స్టూడెంట్స్ యూనియన్ నాయకులు, నిరుద్యోగ విద్యార్థులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ధర్మ స్టూడెంట్స్ యూనియన్ రాష్ట్ర కన్వీనర్ కార్తీక్ మహారాజ్ మాట్లాడుతూ... గాంధీ ఆసుపత్రిలో మోతిలాల్ ఆరోగ్యం క్షీణిస్తున్న కూడా దీక్ష కొనసాగిస్తున్నారని, మోతిలాల్ కు ఏం జరిగినా కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. గత 10 సం: లు కెసిఆర్ చేసిన నియంతృత్వ మోసాన్ని కొనసాగిస్తున్న, సీఎం రేవంత్ రెడ్డి వాళ్ళ రాజకీయ పదవులే నింపుకుంటున్నారే తప్ప నిరుద్యోగుల డిమాండ్స్ ని గాలికి వదిలేశారని అన్నారు. గ్రూప్ 1 1:100 నిష్పత్తి తియ్యాలని, మెగా డీఎస్సీ ద్వారా 25 వేల పోస్టులు ప్రకటించాలని, గ్రూప్ 1,గ్రూప్ 2 పోస్టులు పెంచాలని, జీవో 46 రద్దు చెయ్యాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగ వాదం ఎత్తుకొని నిరుద్యోగులను మోసం చేసి కాంగ్రెస్ పార్టీ పదవులను అనుభవిస్తున్న ఎమ్మెల్సీ బల్మూర్ వెంకట్, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న లు దీనికి నైతిక బాధ్యత వహించి, సిగ్గు, శరం ఉంటే వారి ఎమ్మెల్సీ పదవులకు రాజీనామా చేయాలి, మరియు కోదండరామిరెడ్డి నిరుద్యోగులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ఈవిషయం మీద ప్రభుత్వం వెంటనే స్పందించక పోతే ఉస్మానియా యూనివర్సిటీ వేలాది మందితో ధర్మ సమాజ్ యూనియన్ ఆధ్వర్యంలో నిరాహార దీక్ష చేస్తాం అని హెచ్చరింహారు. ఈ కార్యక్రమంలో ఓయూ జేఏసీ నాయకులు హనుమంత్ నాయక్, వినోద్ నాయక్, మరియు ధర్మ స్టూడెంట్స్ యూనియన్ నాయకులు లింగయ్య మహారాజ్ పాల్గొన్నారు.

## సెల్ఫీ వీడియోతీసి జిమ్ కోచ్ ఆత్మహత్య

**నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్-జూలై1:** జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సెల్ఫీ వీడియో తీసుకుని.. జిమ్ కోచ్ ఆత్మహత్యకు పాల్పడ్డారు. బాలాజీ నగర్ పరిధిలో ఆనంద్ నగర్ కాలనీకి చెందిన జిమ్ కోచ్ రమేశ్(43) ఏమైందో ఏమో కానీ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. 9 ఏళ్ల కిందట తన భార్య స్వాతికి విడాకులు ఇచ్చాడు. అప్పటి నుంచి రమేశ్ తన సోదరుడి కుటుంబం వద్దే ఉంటున్నాడు. కొంతకాలంగా తీవ్ర మనో వేదనతో కాలం గడుపుతున్నాడట. ఈ క్రమంలోనే ఇంట్లో ఎవరూ లేనప్పుడు బెడ్రూమ్‌లో చున్నీతో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. చనిపోవడానికి ముందు సెల్ఫీ వీడియో కూడా తీసుకున్నాడు. జీవితంపై విరక్తితోనే తను సూసైడ్ చేసుకుంటున్నట్టు సెల్ఫీ వీడియోలో వెల్లడించాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో జవహర్ నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు.